بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 17.01.2025 (Telugu)**

# సరియ్యా అబ్దుల్లాహ్ బిన్ రవాహా, సరియ్యా అమర్ బిన్ ఉమయ్యా జమ్రీ నేపథ్యంలో మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర ప్రస్తావన

హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 17.01.2025 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, లండన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

أَشۡهَدُ أَنۡ لَّآ إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشۡهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ۔ بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ۔ اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ۔ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ۔ مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ۔ إِيَّاكَ نَعۡبُدُ وَإِيَّاكَ نَسۡتَعِيۡنُ۔ اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ۔ صِرَاطَ الَّذِيۡنَ أَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ۔

---

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు. నేడు ప్రస్తావించబడుతున్న సరాయా (యుద్ధాల)లోని ఒకటి ఉసైర్ బిన్ రిజామ్ వైపున జరిగిన **సరియ్యా అబ్దుల్లాహ్ బిన్ రవాహా** గలదు. ఈ సరియ్యా ఆరవ హిజ్రి షవ్వాల్ నెలలో ఉసైర్ లేదా యుసైర్ బిన్ రిజామ్ వైపున ఖైబర్ ప్రాంతంలో సంభవించెను.

దీని వివరాలు ఇట్లు ప్రస్తావించబడినవి. అబూరాఫి సలామ్ బిన్ అబిత్తహ్‌ఖీఖ్ హత్యకు గురైన తర్వాత యూదులు ఉసైర్ బిన్ రిజామ్‌ను తమ నాయకునిగా నియమించుకున్నారు. అతడు యూదుల మధ్య నిలబడి ఇట్లు ప్రసంగించడం మొదలు పెట్టెను. 'నా సహచరులలో ఏ ఒక్కరు చేయని పని నేను చేసి చూపిస్తాను. నేను ఘత్ఫాన్ తెగ వద్దకు వెళ్లి వారిని సమావేశపర్చుతాను. అనంతరం మనం ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వైపు బయలు దేరి వారి ఇంట్లోకి ప్రవేశిద్దాం. శత్రువు ఇంట్లోకి ఎవరైనా ప్రవేశించినప్పుడు అతడు తన ఉద్దేశ్యంలో కొంత మేరకు తప్పక సఫలం సాధించి తీరుతాడు.' కావున అతడు ఘత్ఫాన్‌తో పాటు ఇతర తెగల వైపు ప్రయాణిస్తు వారిని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు పోటీగా యుద్ధం చేయుటకు సమావేశపర్చడం ప్రారంభించెను.

దీని వివరాలను హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు (రజి) ఇట్లు వ్రాశారు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు ఈ పరిస్థితుల సమాచారం అందినప్పుడు వారు సల్లల్లాహు అలైహి వసల్లం వెంటనే ఒక అన్సారీ అనుచరుడు అబ్దుల్లాహ్ బిన్ రవాహా (రజి)ను మరో ఇతర ముగ్గురు అనుచరులతో కలిపి ఖైబర్ వైపునకు పంపిరి. కనుక అబ్దుల్లాహ్ బిన్ రవాహా (రజి) మరియు వారి సహచరులు రహస్యంగా మొత్తం పరిస్థితులను, వివరాలను సేకరించి ఈ వార్తలు నిజమే అని నిర్ధారించుకున్న తర్వాత తిరిగి వచ్చేసిరి. అదే రోజులలో ఒక ముస్లిమేతరుడైన వ్యక్తి ఖారిజ బిన్ హుసైల్ దైవికంగా ఖైబర్ ప్రాంతం గుండా మదీనాకు చేరుకొనెను. అతడు కూడ అబ్దుల్లాహ్ బిన్ రవాహా (రజి) మాటను ధృవీకరించెను.

ఈ ధృవీకరణ తర్వాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అబ్దుల్లాహ్ బిన్ రవాహా (రజి) నాయకత్వంలో 30 మంది అనుచరుల ఒక బృందంను ఖైబర్ వైపునకు పంపిరి. అబ్దుల్లాహ్ బిన్ రవాహా (రజి) మరియు ఉసైర్ బిన్ రిజామ్ మధ్య ఖైబర్‌లో జరిగిన సంభాషణను బట్టి తెలుస్తున్నదేమనగా

ఉసైర్‌ను మదీనాకు పిలిపించి ఈ అశాంతి ప్రక్రియ అంతమై దేశంలో శాంతి భద్రతల పరిస్థితి ఏర్పడేటట్లు అతనితో ఒక ఒప్పందం కుదుర్చుకోవలెను. ఈ కోరికలో వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఎంత వరకు సిద్ధంగా ఉండిరనగా ఉసైర్‌ను ఖైబర్ ప్రాంతానికి అధ్యక్షునిగా ఒప్పుకోవలసి వచ్చినచో ఒప్పుకోవాలని భావించిరి. అధికార పిశాచి అయిన ఉసైర్‌కు ఈ ప్రతిపాదన నచ్చెను. అతని మనసులో మరో రహస్య ఉద్ధేశం ఉన్నా ఉండోచ్చు. కాని నాకీ ప్రాతిపాదన నచ్చినదని మాత్రం అతడు వెల్లడించెను. సారాంశమేమనగా అబ్దుల్లాహ్ బిన్ రవాహా (రజి) బృందంతో కలిసి మదీనాకు వచ్చుటకు ఉసైర్ సిద్ధమయ్యెను. అబ్దుల్లాహ్ బిన్ రవాహా (రజి) మాదిరిగా అతడు కూడ 30 మంది యూదులను తన వెంట తీసుకొనెను. ఈ రెండు బృందాలు ఖైబర్ నుండి బయలు దేరి ఖైబర్ నుండి ఆరు మైళ్ల దూరంలో ఉన్న ఖర్‌ఖరహ్ ప్రాంతంనకు చేరుకున్నప్పుడు ఉసైర్ ఉద్ధేశం మారిపోయెను లేదా ఇంతకు ముందే అతను దురుద్ధేశం కలిగి ఉన్నచో అది ఇప్పుడు బహిర్గతమయ్యే సమయం వచ్చెను. కావున మార్గమధ్యలోనే ముస్లిములు మరియు యూదుల మధ్య యుద్ధం మొదలయ్యెను. ఇరు బృందాల సంఖ్య సమానముండెను. యూదులు ఇందుకు మానసికంగా ముందుగానే సిద్ధంగా ఉండిరి. కాని ముస్లిములు దీని గురించి ఏమాత్రం ముందస్తుగా ఆలోచించ లేదు. అయినను దేవుడు కరుణించినందున కొందరు ముస్లింలు గాయాలపాలైనారు. కాని వారిలో ఏ ఒక్కరు కూడ ప్రాణం కోల్పోలేదు. అదే యూదులు మాత్రం తమ మోసానికి తామే బలైపోతూ అందరికందరు ప్రాణాలు కోల్పోయారు.

అనుచరుల ఈ బృందం మదీనాకు తిరిగి చేరుకున్నప్పుడు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు పరిస్థితులు తెలియగా ముస్లింలు సురక్షితంగా చేరుకున్నందుకు దేవునికి కృతజ్ఞతలు తెలిపి ఇట్లనిరి. ఈ క్రూర బృందం నుండి దేవుడు మీకు మోక్షం ప్రసాదించెను.

అబ్దుల్లాహ్ బిన్ రవాహా (రజి) బృందం ఉసైర్ మరియు అతని సహచరులను మార్గమధ్యలో అవకాశం పుచ్చుకొని హత్య చేయాలనే ఉద్ధేశంతోనే ఖైబర్ ప్రాంతం నుండి తీసుకొని వచ్చెనని ఈ సంఘటన గురించి కొందరు క్రైస్తవ చరిత్రకారులు విమర్శించారు. ముస్లింలు ఇదే సంకల్పంతో అక్కడికి వెళ్లినట్లు చరిత్రలో ఎలాంటి సాక్ష్యం లభించదని ఇంతకు ముందు ప్రస్తావించబడెను. వాస్తవానికి గ్రహించినచో ఇతర సాక్ష్యాలను అటుంచితే అబ్దుల్లాహ్ బిన్ ఉనైస్ (రజి) నోట వెలువడిన పదాలు "ఓ దేవుని శత్రువు! మోసానికి పాల్పడే ఉద్ధేశం గలదా?" ఇలాగే మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించిన ఈ పదాలు "ఈ క్రూర బృందం నుండి దేవుడు మీకు మోక్షం ప్రసాదించెను." ముస్లింలు సదుద్ధేశం కలిగి ఉండిరని, శాంతిని ఆకాంక్షించిరనుటకు సరిపోతాయి.

అబూసుఫ్యాన్ వైపు పంపబడిన మరో **సరియ్యా అమర్ బిన్ ఉమయ్యా జమ్రీ** గలదు. ఇబ్నె హష్షామ్, ఇబ్నె కసీర్ మరియు తబ్రీ మొదలగు వారు ఈ సరియ్యను హిజ్రీ నాలుగవ సం॥లోని **'రజీ'** సంఘటన తర్వాత ప్రస్తావించారు. కాని ఇబ్నె సాద్ మరియు జర్ఖాని ఈ సరియ్యను హిజ్రీ ఆరవ సం॥లోని సరాయాల క్రింద ప్రస్తావించారు. సీరత్ ఖాతమున్నబియ్యాన్ పుస్తకంలో హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు (రజి) ఈ సరియ్యను ఆరవ హిజ్రీలో ప్రస్తావించారు.

ఈ సరియ్యా వివరాలు ఇట్లు గలవు. కొందరు ఖురైష్ వ్యక్తులతో అబూసుఫ్యాన్ ఇట్లనెను. వీధులలో అటు ఇటు సంచరిస్తున్నప్పుడు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ను హత్య చేయువాడు

మీలో ఒక్కడు కూడ లేడు. అనంతరం గ్రామీణ నివాసులలోని ఒక వ్యక్తి అబూసుఫ్యాన్ ఇంటికి వచ్చి అతనితో ఇట్లనెను. నువ్వు నాకు సహకరించినచో నేను ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు చేరుకొని అకస్మాత్తుగా అతనిపై దాడి చేయుదును. గద్ద రెక్కల లాంటి ఒక చురకత్తి నా దగ్గర ఉన్నది. దానితో నేను ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)పై దాడి చేయుదును. అనంతరం నేను ఏదో ఒక సమూహంలో కలిసిపోయి, పరారై ఆ సమూహం నుండి ముందుకు పరుగెత్తుదును. ఎందుకనగా నేను రహదారుల నిపుణుణ్ణి. కావున అబూసుఫ్యాన్ అతనికి ఒంటెతో పాటు ప్రయాణ ఖర్చులు కూడ చెల్లించెను. అతడు రాత్రి పూట బయలు దేరి మదీనాకు చేరుకొని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎక్కడున్నారో వాకబు చేయసాగెను. తుదకు అతనికి వారి సల్లల్లాహు అలైహి వసల్లం గురించి చెప్పబడెను. అప్పుడతడు తన ఒంటెను కట్టివేసి వారి సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు చేరుకొనెను. అప్పుడు వారు సల్లల్లాహు అలైహి వసల్లం బనూ అబ్దుల్ అష్హల్ మస్జిద్‌లో ఉండిరి.

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అతణ్ణి చూడగానే ఇట్లనిరి. నిశ్చయంగా ఈ వ్యక్తి మోసం చేయుటకు సంకల్పించాడు. ఇతని మరియు ఇతని సంకల్పం మధ్య అల్లాహ్ తఆలా అటంకంగా ఉన్నాడు. వారి సల్లల్లాహు అలైహి వసల్లంపై దాడి చేయుటకు అతడు ముందుకు రాగానే ఉసైద్ బిన్ హుజైర్ అతని చద్దరు లోపలి అంచును పట్టుకొని లాగిరి. అప్పుడు అనుకోకుండా అతని చేతిలో ఉన్న చురకత్తి క్రింద పడెను. అతడు వెంటనే ఇట్లు మొత్తుకొనెను. నా రక్తం! నా రక్తం! అనగా నాకు ప్రాణ భిక్ష పెట్టండి. హజ్రత్ ఉసైద్ అతని మెడ పట్టుకొనిరి. కాని తర్వాత అతణ్ణి విడిచి పెట్టిరి. నువ్వు ఎవరో? నాకు నిజా నిజలు చెప్పమని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనిరి. నాకు రక్షణ ప్రసాదించండని అతడనెను. సరే! అని వారు సల్లల్లాహు అలైహి వసల్లం బదులిచ్చిరి. అతడు తన పని, అబూసుఫ్యాన్ తనకు అప్పగించిన విషయం తెలిపెను. కావున వారు సల్లల్లాహు అలైహి వసల్లం అతణ్ణి విడిచి పెట్టిరి. ఈ దయానుగ్రహాణ్ణి చూసి అతడు ఇస్లాం స్వీకరించెను.

అబూసుఫ్యాన్ పన్నిన ఈ హత్యా కుట్ర వలన మక్కా ప్రజల సంకల్పం, ఉద్దేశం గురించి వాకబు చేయవలసిన అవసరం మరింత అనివార్యమయ్యెను. కనుక వారు సల్లల్లాహు అలైహి వసల్లం తమ ఇద్దరు అనుచరులు అమర్ బిన్ ఉమయ్య జమ్రీ మరియు సల్మా బిన్ అస్లమ్‌ను మక్కా వైపు పంపిరి. అబూసుఫ్యాన్ పాల్పడిన ఈ హత్యా కుట్రలతో పాటు అతని గత రక్తపాత చర్యలను పరిగణలోకి తీసుకొని అవకాశం లభించినచో ఇస్లాంకు యుద్ధ శత్రువుగా ఉన్న అతణ్ణి హతమార్చాలని అనుమతి ఇచ్చిరి. కాని ఉమయ్యా మరియు వారి సహచరుడు మక్కాకు చేరుకున్నప్పుడు మక్కావారు జాగరూకులైరి. ఫలితంగా ఈ ఇద్దరు అనుచరులు తమ ప్రాణాలు దక్కించుకొంటూ మదీనాకు తిరిగి వచ్చేసిరి. మార్గమధ్య లో వారికి ఖురైష్‌ల ఇద్దరు గూఢచారులు లభించిరి. ముస్లింల కదలికలతో పాటు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పరిస్థితులను తెలుసుకొనుటకు వీరిని ఖురైష్ పంపించెను. ఈ ఎత్తుగడ కూడ ఖురైష్‌ల మరో హత్య ప్రయత్నంలో భాగం కావచ్చును. కాని అల్లాహ్ తఆలా దయ వలన వీరి గూఢచర్యం గురించి ఉమయ్య మరియు సల్మాకు తెలిసింది. కావున వారు ఈ గూఢచారులపై దాడి చేసిరి. ఈ కోట్లాటలో ఒక గూఢచారి మరణించగా రెండవ వ్యక్తిని వారు బంధించి తమ వెంట మదీనాకు తీసుకొని వచ్చిరి. హుజూరె అన్వర్ ఇట్లనిరి. మిగతా వివరాలు తర్వాత తెలుపబడును. ఇన్‌షాఅల్లాహ్.

దుఆలకు పిలుపునిస్తు హుజూరె అన్వర్ ఇట్లనిరి. పాకిస్తాన్ పరిస్థితుల గురించి నేను దుఆలకు చెప్తుంటాను. కొన్ని సార్లు ఇవి చాలా తీవ్ర పరిస్థితిని దాల్చుకుంటాయి. నిర్వహకులు, ప్రభుత్వం కూడ తీవ్రవాద అభిలాషులైన మౌల్వీల చేతులలో చిక్కుకున్నట్లు తెలుస్తుంది. మస్జిద్ గోపురం ధ్వంసం చేశారు, మిహ్రాబ్ (ఇమామ్ స్థలం)ను నేలమట్టం చేశారనే వార్తలు ఇంతకు ముందు వచ్చేవి. కాని ఇప్పుడు అనగా నిన్న డస్కా (నగరం) లో వీరు రహదారి నిర్మాణం మాటున ఇంత స్థలం మేము తీసుకుంటాము, అక్కడ బుల్డోజర్‌తో శిథిలాలను తొలగించి స్థలం శుభ్రం చేస్తామని మొదట నోటిస్ పంపారు. ఇందులో మస్జిద్ ఆవరణలోని స్నానాల గదులు మొదలగు ఉండెను. కాని బుల్డోజర్ తెచ్చిన తర్వాత మౌల్వీలు చెప్పినందున మొత్తం మస్జిద్‌నే నేలమట్టం చేసి షహీద్ చేశారు. ఈ మస్జిద్ చాలా పురాతనమైనది, దేశ విభజన కంటే ముందే నిర్మించ బడెను. బహుశా చౌధ్రీ జఫ్రుల్లాహ్ ఖాన్ గారు దీనిని కట్టించిరి. సారాంశమేమనగా ఇప్పుడు వీరు ఇంత వరకు దిగజారిపోయారు. వీరిని అల్లాహ్ తఆలా త్వరగా శిక్షించగలడు. వీరి కుట్రలను వీరిపైనే పడవేయుగాక! ఇందుకే అహ్మదీయులు ప్రత్యేకంగా పాకిస్తాన్ అహ్మదీయులు చాలా ఎక్కువ దుఆలు చేయవలసి అవసరమున్నది. ఇటు వైపు దృష్టి సారించండి. ఇలాగే పాలస్తీనా గురించి కూడ ఒప్పందం కుదురుతుంది. కుదిరిందని కొందరంటున్నారు ఇంకా కాలేదని మరి కొందరంటున్నారు. ఒప్పందం తర్వాత కూడ దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఈ విషయం పట్ల కూడ ప్రజలు అనవసరంగా ఆనందం వ్యక్త పరుస్తున్నారు. కాని దజ్జాలీ శక్తులను నమ్ముట మంచిదికాదని వారు అర్థం చేసుకోవలెను. అందుకే ఇంత ఎక్కువ అనందపడాల్సిన అవసరం లేదు. వీరి కొరకు దుఆలు చేయవలసిన అవసరమున్నది. ముస్లింలు తెలివితేటలనుపయోగించి తమ హక్కులను పొందుటకు ప్రయత్నించవలెను. ఈ విషయంను అర్థం చేసుకొనుటకు అల్లాహ్ తఆలా ముస్లింలకు కూడ సద్బుద్ధి ప్రసాదించుగాక! (ఆమీన్)

ఖుత్బా ముగింపులో ఈ క్రింది ముగ్గురు మృతుల సద్గుణాలను ప్రస్తావించి వారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతునని కూడ హుజూరె అన్వర్ ప్రకటించిరి.

(1) షేక్ ముబారక్ అహ్మద్ గారు, నాజిర్ దీవాన్ సదర్ అన్జుమన్ అహ్మదియ్య రబ్వా

(2) గౌ॥ ముహమ్మద్ మునీర్ ఇదల్బీ గారు ఆఫ్ ఖతర్

(3) గౌ॥ అబ్దుల్ బారీ తారిఖ్ గారు, ఇంచార్జి కంప్యూటర్ సెక్షన్ వఖ్ఫె జదీద్ రబ్వా.

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*